ముురుగునీటి శుద్ధి ప్లాంట్ సిద్ధం

- విజయవంతంగా సాగుతున్న ట్రయల్‌రన్
- వైఎస్సార్‌సీపీ హయాంలో చకచకా నిర్మాణం
- రోజుకు కోటి లీటర్ల మురుగునీటి శుద్ధి సామర్థ్యం
- 4,500 ఎకరాల పంట భూములకు తీరనున్న దాహం



మురుగునీటి శుద్ధి ప్లాంట్



ఛాంబర్లోంచి వెలుపలకి వ్యర్థాలు

తెనాలి: పట్టణ పూలే కాలనీలో రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ 'ఎస్‌టీపీ) నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం ట్రయల్ రన్ జరుగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ భారీ ప్రాజెక్టుకు రోజుకు కోటి లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. పట్టణంలో మురుగునీటి బెడద తీరటమే కాకుండా, ఆ నీటితో నాలుగున్నర వేల ఎకరాల పంటభూములకు సాగునీరు అందించనున్న ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

పట్టణాల్లో మురుగునీటిని శుద్ధి చేసి తగిన అవసరాలకు వినియోగించాలన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గైడ్‌లైన్స్ ఈ ప్రాజెక్టుకు దారితీశాయి. రాష్ట్రంలోని వివిధ పట్టణాలతోపాటు తెనాలిలోనూ ఈ ప్రాజెక్టుకు అనుమతి లభించింది. పూలే కాలనీలో ఏనాడో మూలనపడ్డ మున్సిపాలిటీ మురుగునీటి శుద్ధి ప్లాంటుకు గల స్థలంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.30 కోట్ల వ్యయంతో తాజా ప్లాంటును చేపట్టారు. పట్టణం నడిబొడ్డులోని పెదరావూరు-వీస్సార్ కాలేజి రోడ్డుకు తూర్పువైపున గల ఏరియా మొత్తాన్ని అంటే పట్టణ సగభాగాన్ని జోన్-1గా విభజించారు. ఆ ప్రాంతంలోని మురుగునీటి శుద్ధి కోసం ఈ ప్లాంటును నిర్మించారు.

ముంబయికి చెందిన ఖిలారి ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన ఈ ప్లాంట్ నిర్మాణం పనులు కరోనా మహమ్మారి కారణంగా ఆలస్యం జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక శ్రద్ధతో 2022-24లో ఈ బారీ ప్రాజెక్టును పూర్తిచేసి, ట్రయల్‌రన్‌కు సంసిద్ధం చేశారు. కొత్తగా సిబ్బంది క్వార్టర్స్‌నూ నిర్మించారు. అప్రోచ్‌రోడ్డు పనులు చేస్తున్నారు. స్థానిక రామలింగేశ్వరపేట నుంచి వెళ్లే జంపని డ్రెయిన్‌కు ఈ ప్లాంట్‌ను అనుసంధానం చేశారు. ప్రధాన డ్రెయిన్‌నుంచి మూడు మీటర్ల వెడల్పుతో సిమెంటు కాల్వ, వియర్ సెక్షన్, ఇన్‌లెట్ ఛాంబర్, సెప్టేజీ హోల్డింగ్ ట్యాంక్, మెకానికల్, ఎలక్ట్రికల్, సెన్సార్స్ అన్నీ కలిపిన టెక్నాలజీతో పంప్‌హౌస్, ప్రైమరీ ట్రీట్‌మెంట్ యూనిట్, అమెరికన్ కంపెనీ గ్జైలమ్ సరఫరా చేసిన ఎస్‌బీఆర్ బేసిన్స్-2, క్లోరిన్ టోనర్ రూమ్, స్లడ్జి థిక్‌నర్, సెంట్రిఫ్యూజ్ బిల్డింగ్, బ్లోయర్ రూమ్, ప్యానెల్ రూమ్, స్కాడా రూమ్, 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 500 కేవీ జనరేటర్ యార్డు, లేబొరేటరీతో కూడిన అడ్మినిస్ట్రేషన్ భవనం ఈ ప్రాజెక్టులోని ముఖ్యమైన విభాగాలన్నీ పూర్తయ్యాయి.

ప్లాంటు పనితీరులోకి వెళితే, డ్రెయినులోంచి వచ్చే మురుగునీరు ఇన్‌లెట్ చాంబర్‌తో పంప్‌హౌస్‌లోకి వెళతాయి. 30 మి.మీకు పైబడిన రాళ్లు, ఇతర చెత్తాచెదారం చాంబర్‌లోంచి బయటకు వచ్చేస్తాయి. పంప్‌హౌస్ నుంచి ఎస్‌బీఆర్ బేసిన్స్‌లోకి వెళ్లాక మురుగునీటి శుద్ధి జరుగుతుంది.

తర్వాత లేబొరేటరీలో పరీక్షలు జరిపి, కాలుష్య నియంత్రణ మండలి సూచించిన పరిమితుల ప్రకారం ఉందని నిర్ధారించుకున్నాక సాగునీటి కాల్వలోకి ఈ నీటిని విడుదల చేస్తారు. శుద్ధి చేసే క్రమంలో వచ్చే ఘనవ్యర్థం వేరొక ట్యాంకులోకి వెళుతుంది. ఈ వ్యర్థ్యాన్ని మున్సిపాలిటీ ఎరువుగా నర్సరీలకు విక్రయించొచ్చు. కంప్యూటర్ టెక్నాలజీతో కూడిన స్కాడా రూమ్ నుంచే ఈ యూనిట్‌ను ఆపరేట్ చేస్తారు.

నగరాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా శుద్ధిచేసిన నీటిని గార్డెన్స్‌కు, హోటల్స్‌కు, రైల్వే వాగన్ల శుభ్రతకు సంబంధిత కార్పొరేషన్లు విక్రయిస్తుంటాయి. తెనాలిలో సాగునీటి ఆవశ్యకత ఉన్నందున ఈ నీటిని మున్సిపాలిటీ పంటపొలాలకు విడుదల చేస్తుంది. జోన్-1లో 2048 నాటికి 2.50 లక్షల జనాభా ఉంటుందన్న అంచనాతో రోజుకు కోటి లీటర్ల మురుగునీటి శుద్ధి కోసం ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ప్రస్తుతం రోజుకు 30 లక్షల లీటర్ల మురుగునీరు వస్తున్నాయని అధికారుల అంచనా. మురుగునీటి బెడదతో ఇంతకాలం ఇబ్బందులు పడిన సమీపప్రాంత రైతులు, ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తున్నారు.

త్వరలో ప్రారంభోత్సవం జరుగుతుంది



మురుగునీటి శుద్ధితో పాటు పంటభూముల దాహం తీర్చేందుకు ఉద్దేశించిన ఎస్‌టీపీ ప్లాంటు నిర్మాణం పూర్తయింది. కొంతకాలంగా ట్రయల్ రన్ కూడా జరుగుతోంది. అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక ప్రారంభోత్సవం జరుగుతుంది.

– బండి శేషన్న, కమిషనర్



పైభాగంలో మురుగు శుద్ధి నిర్మాణాలు



మురుగు శుద్ధి



అప్రోచ్ రోడ్డు

క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్ తీసుకోండి

కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని వ్యాపారస్థులందరూ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 37వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే చిరు వ్యాపారుల వద్దకు వెళ్ళి ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయా లేదా అనే దానిపై ఆరా తీశారు. అందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

12న ఉచిత కంటి, దంత వైద్యశిబిరం



తెనాలి: పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ వైకుంఠపురం, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న ఉచిత కంటి, దంత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. కళాకారుల సంఘ సభ్యుల కోసం ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు సోమవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. కళాకారుల సంఘంలోని సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని, అవసరమైన కళ్లజోడు, మందులతోపాటు శస్త్రచికిత్సను కూడా ఉచితంగా పొందవచ్చని చెప్పారు. సభ్యులతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా ఉచిత వైద్యసేవలను ఉపయోగించుకోవచ్చని సూచించారు. ఆసక్తి గల కళాకారుల సంఘం సభ్యులు వైద్య శిబిరానికి ముందురోజైన 11వ తేదీ ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం 5 గంటల్లోపు బీసీ కాలనీలోని కళాకారుల సంఘంలో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, రోటరీ క్లబ్ బాధ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు డి.మురళీకృష్ణ, చెరుకుమల్లి సింగారావు, కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు, కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలి

కొల్లూరు: ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు వర్తించాలంటే సొంత భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ)కు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏఓ వి.బుష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా రైతులకు ఆధార్ కార్డు తరహాలో 14 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సంఖ్య నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తించే అవకాశం లేనందున సొంత భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ రంగ ఆధునీకరణ (డిజిటలైజేషన్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన విశిష్ట సంఖ్య నమోదుకు సొంత వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలను సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు ప్రక్రియకు పట్టాదారు పాస్ పుస్తకం నకలు లేని పక్షంలో 1బీ, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ నంబర్ లింకైన ఫోన్ అవసరమన్నారు. అదే విధంగా మండలంలోని రైతులు, కౌలు రైతులు రబీ పంట నమోదు, ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

గుండెపోటు నుంచి రక్షించేందుకే స్టెమీ కార్యక్రమం



నగరం: గుండెపోటు నుంచి ప్రజలను రక్షించేందుకు స్టెమీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రత్నకుమారి చెప్పారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్టెమీ కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రత్న కుమారి మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారికి గంటలోపు టెనెక్ట్‌ప్లేస్ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల ప్రాణాపాయం లేకుండా చూడవచ్చన్నారు. ఈ ఇంజక్షన్‌లు గత 18 నెలల నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గుండెదడ, ఎడమ భుజం లాగడం, ఛాతీ నొప్పి, స్పృహ కోల్పోవడం, ఎక్కువగా చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే 108కు కాల్ చేయాలన్నారు. గుండె నొప్పికి గోల్డెన్ అవర్ చికిత్స చేసేందుకే స్టెమీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు మధుప్రభాకర్, మహేశ్వరరావు, శ్యామ్యూల్‌పాల్ ప్రదీప్, సౌమ్య, జ్ఞానచైతన్య, శాంతకుమారి, యామినిప్రియ పాల్గొన్నారు.

'ఆళ్ల' కవితకు బహుమతి



తెనాలి: గుంటూరుకు చెందిన అమరావతి సాహితీ మిత్రుల 'సాహిత్య సామాజిక సేవాసంస్థ' కవితలపై వర్క్‌షాపు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో జనవరి నెలలో కొత్త సంవత్సరంఅనే అంశంపై కవితాలను ఆహ్వానించారు. తెనాలికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర ఆళ్ల నాగేశ్వరరావు పంపిన 'కొత్త అడుగు' అనే కవితకు ఉత్తమ కవితగా ఎంపికచేశారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రావి రంగారావు ఆ ప్రకారం ధృవీకరణను, ప్రశంసాపత్రాన్ని సోమవారం పంపారు. ఆళ్ల నాగేశ్వరరావుకు అభినందనలు తెలియజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సుల్తానాబాద్‌లోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం ఉందన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 29 బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు? ఎవరు సేకరించారన్న అంశాలను పరిశీలిస్తున్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

తెనాలిఅర్బన్: పన్నుల వసూలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సోమవారం రెవెన్యూ ఉద్యోగులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి రోజు వారు ఉదయం సాయంత్రం బకాయిదారులను కలిసి పన్నులను వసూలు చేయాలని సూచించారు. నూటికి నూరుశాతం వసూలు చేసి ముందుస్థానంలో ఉండాలని సూచించారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ నెల చివరి లోపు దాదాపు పన్నుల వసూలు పూర్తి కావాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌వో రాంప్రసాద్, పలువురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



ఎన్‌సీఆర్ స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ చేస్తున్న కమిషనర్ శేషన్న



విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌తో నులిపురుగులకు చెక్‌పెట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ ట్యాబ్లెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలు, అంగన్‌వాడీ సెంటర్‌లలో వీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అందరూ వీటిని మింగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వి.సుధారాణి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ హరిణి, పలువురు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

+ నులిపురుగులు కడుపులో ఉండటం వలన పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి అందరికీ వాటిని పంపిణీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపంతో నీరసంగా ఉండటం, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు ఎక్కువ మందిలో కనిపిస్తుంటాయని చెప్పారు. ఈ లక్షణాలు ఉన్న వారు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేసుకోవడం వలన వాటిని అదిగమించవచ్చని చెప్పారు. స్కూల్‌కు రాని విద్యార్థులకు కూడా ఈ నెల 17న మరోసారి పంపిణీ చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు చిరసాని ప్రభాకర్‌రెడ్డి, వంగాల పున్నారెడ్డి, అందె బాలచంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, శివగణేష్, జి.రవికుమార్, వివిధ పాఠశాలల హెచ్ ఎంలు షేక్ మౌలాబి, పి.లతాదేవి, పివి.సుధారాణి, డి.ప్రకాశరావు, పాల్గొన్నారు.

పెదరావూరు శివారులో ఆలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెదరావూరు(తెనాలి): రూరల్ మండల గ్రామం పెదరావూరు శివారులో గల శ్రీమహా విద్యాపీఠం. అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో సోమవారం శ్రీలక్ష్మీగణపతి, బాలాంబిక సమేత సర్వహితేశ్వర స్వామి ఆలయన శంకుస్థాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకాంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞపీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశంకరాచార్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో లోక కల్యాణార్థమై దేవాలయ నిర్మాణానికి సంకల్పించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం సుబ్రహ్మణ్య క్షేత్రానికి ఈశాన్య దిశన 30 సెంట్ల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ఈ క్రమంలో ఉదయం 11.12 గంటలకు శంకుస్థాపన చేశారు. అవసరమైన విశేష పూజలు చేశారు. ఆలయంలో ఎలాంటి రుసుం లేకుండా దైవానుగ్రహం కోసం వచ్చిన భక్తులు స్వామివారిని తామే స్వయంగా అభిషేకించుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నట్టు సుబ్రహ్మణ్య క్షేత్ర నిర్వాహకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యస్వామి వెల్లడించారు. ఆలయానికి వచ్చిన భక్తులు పూజలు అనంతరం ధ్యానం చేసుకునే విధంగా విశాలమైన సముదాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కంచి కామకోటి భక్తులు మాగంటి కాశీవిశ్వేశ్వర ప్రసాద్ కుటుంబ సభ్యులు పెదరావూరు గ్రామ పెద్దలు పాలడుగు రమేష్, కుదరవల్లి రమేష్‌బాబు. పాలడుగు సురేంద్ర, సుబ్రమణ్య క్షేత్రం అర్చకులు శుభం శర్మ, నారాయణమూర్తి. లక్ష్మీ నరసింహమూర్తి, సీహెచ్.విజయ్ కుమార్. సుబ్రహ్మణ్యశర్మ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై పంచముఖ ఆంజనేయస్వామి



సూర్యప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు విశేషంగా కొనసాగుతున్నాయి. ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ప్రాతఃకాల సంధ్యా పూజలు చేశారు. తదుపరి సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి మంగళ వాయిద్యాల నడుమ, వేదమంత్రాలతో ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై పట్టణ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభ వాహన సేవ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో, ఆర్‌వీ కిరణ్, ఆర్.సురేష్, నాగమారుతి మిత్రబృందం విశేషంగా యాగ్నిక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఉత్సవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు గుడివాడ బాలకృష్ణ, సంకీర్తన బృందం నిర్వాహకురాలు మూర్తి అనురాధ తదితర భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11వ తేదీ మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీ మైనాక వాహన సేవ, సాయంత్రం 6 గంటలకు శ్రీ స్వామి వారి గజవాహన సేవ, అమ్మవారి గరుడవాహన సేవ, సువర్చల హనుమత్ కల్యాణం విశేషంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత భక్తులు కల్యాణ మహోత్సవం వేడుకల్లో పాల్గొని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి అనుగ్రహానికి పాత్రులు కావలసిందిగా కోరారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం



కర్లపాలెం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయం బుద్ధాం కో ఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన సామలు, కొర్రలు, అరికలు, ఊదలు వంటి సిరిధాన్యాలతో పాటు కూరగాయలు, ఆకుకూరలను సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విక్రయించారు. కో ఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవిశంకర్, నందిని, తిరుపతమ్మ, భారతి తదితరులు ఉన్నారు.

పశువుల్లో నైట్రేట్ విషప్రభావంపై అప్రమత్తం

- నీటిని పశువైద్యశాలకు పంపిస్తే పరీక్షచేస్తాం
- ఏరియా పశువైద్యశాల ఏడీ డాక్టర్ నాగిరెడ్డి



తెనాలి: పశువుల్లో నైట్రేట్ విషప్రభావం లేకుండా పశుపోషకులు చూసుకోవాలని స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొన్ని ప్రదేశాల్లో నీటిలోనూ, పచ్చిగడ్డి, ఎండుగడ్డి, పాతర గడ్డిలోనూ నైట్రేట్ శాతం 0-500 పీపీఎం ఉన్నట్టుగా పరీక్షల్లో తేలిందన్నారు. నైట్రేట్ శాతం కేవలం 100 పీపీఎ ంలోపు ఉన్నట్టయితే ఆ మేత/నీరు పశువులకు ఎలాంటి హాని చేయదని తెలిపారు. అధిక నేట్రేట్‌తో కూడిన నీరు, మేత తీసుకున్న పశువులు అరగంట నుండి నాలుగు గంటలలోపు విషప్రభావానికి లోనవుతాయని తెలిపారు. నీటి లేదా చాక్లెట్ గోధుమరంగు శ్లేష్మ పొరలు, వేగంగా లేదా కష్టంగా శ్వాస తీసుకోవటం, శ్వాస తీసుకోవటం శబ్దం, నాడి వేగవంతంగా కొట్టుకోవటం, లాలాజలం కారుట, ఉబ్బరం, వణుకు, అస్థిరంగా ఉండటం, తరచుగా మూత్రం పోయటం, పొరుడు లక్షణాలు, కడుపునొప్పి, చూడి పశువులు ఈసుకుపోవటం, పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గటంతో పాటు, పశువు బలహీనమై కోమలోకి వెళ్లటం, ఒక్కోసారి మరణించటం కూడా సంభవిస్తుందని వివరించారు. రైతులు, పశుపోషకులు వీటిని గమనించి సకాలంలో వైద్యం చేయించాలని సూచించారు. నీటిపై ఏవైనా అనుమానాలుంటే శుభ్రమైన ప్లాస్టిక్ సంచి లేదా సీసాలో ఆ నీటిని సేకరించి, పశువైద్యశాలకు పంపించాలని కోరారు. ఆ నమూనాను విశ్లేషించి నైట్రేట్ శాతాన్ని వెల్లడిస్తామన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి ప్రభాకరరావు అస్తమయం

రేపల్లె రూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ కోశాధికారి అడుసుమల్లి ప్రభాకరరావు (65) పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థల్లో సభ్యునిగా పనిచేస్తూ సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. బాల్య వివాహాల నివారణకు గ్రామీణ ప్రాంతాలలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మృతిపట్ల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, పలు సేవా సంఘాల సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భార్య గతంలో రహదారి ప్రమాదంలో మృతి చెందారు. ప్రభాకరరావుకు ఇరువురు కుమారులు ఉన్నారు.


అధ్వానం!



గురవయ్య కాలనీ నుంచి పూలే కాలనీ వెళ్ళే రహదారి వెంట ఉన్న మురుగు కాల్వలు అధ్వాన్నంగా తయారయ్యాయి. కాల్వల్లో వ్యర్థాలు పెరుకుపోయి దుర్వాసన వస్తోంది. సమీపంలో పేద ప్రజలు నివాసిస్తున్న ఇప్పటి వరకు కాల్వలను బాగు చేయించిన వారు లేరు. దీంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే కాల్వల్లోని వ్యర్థాలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

-తెనాలిఅర్బన్

ధర్మ నిధి సేకరణకు స్వచ్ఛంద సహకారం అవసరం



కొల్లూరు: హిందూ ధర్మ రక్షణ కోసం ధర్మ నిధి సేకరణకు స్వచ్ఛంద సహకారం అవసరమని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. సోమవారం మండలంలోని చినపులివర్రు, వేమూరు మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామాలలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా కన్వీనర్‌లు ధర్మ నిధి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందువులు అన్య మతాలు స్వీకరించకుండా హిందూ ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. హింధూ ధర్మ రక్షణ కోసం సమరసత సేవా ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు మండల రాజకుమారి, సవరాల మాధవి, కూచిభట్ల లక్ష్మిగాయత్రి, మల్లేశ్వరి, చవ్వాకుల శాంతికుమారి, గోగిశెట్టి సతీష్‌నాయుడు, గాజుల శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.